క్లుప్తంగా

నేడు నియోజకవర్గ పురోగతిపై సమావేశం

సత్తెనపల్లి: పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 10 గంటలకు సత్తెనపల్లి నియోజకవర్గ స్థాయి అన్ని ప్రభుత్వ శాఖల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమావేశం జరుగుతుందని తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి మంగళవారం తెలిపారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు హాజరవుతారన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

గిన్నిస్‌బుక్ రికార్డు సాధించిన అంకిత్‌పాల్‌కు సత్కారం



సత్తెనపల్లి: పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం(రామకృష్ణాపురం)లో ఎనిమిదవ తరగతి చదువుతున్న ప్రత్తిపాటి అంకిత్ పాల్ 18 దేశాలకు చెందిన 1,046 మందితో స్వరాలు ఆలపించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని రఘురామ్ నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో సత్తెనపల్లి శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ అంకిత్ పాల్‌ను ప్రత్యేకంగా అభినందించి దుశ్శాలువాతో సత్కరించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించి సర్టిఫికెట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో 6వ వార్డు మాజీ కౌన్సిలర్ తోట అంబిక తదితరులు ఉన్నారు.

ఫుడ్ కోర్టులో తనిఖీలు



సత్తెనపల్లి: పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని కేకే ఫుడ్ కోర్ట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు, సివిల్ సప్లయిస్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నాసిరకం టీ పొడి, ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన పిండి పదార్థాలు, టేస్టింగ్ సాల్ట్ , ప్రభుత్వం సరఫరా చేస్తున్న పంచదార, పీడీఎస్ రైస్, డొమెస్టిక్ సిలిండర్లను గుర్తించారు. డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీన పర్చుకున్నారు. ఆహార పదార్థాల శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపి నిర్వాహకులకు నోటీసులు పంపుతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ, సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ విజయ్ కుమార్



సత్తెనపల్లి: ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.విజయ్‌కుమార్ అన్నారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల, నందిగామ, ఫణిదం గ్రామాల్లో ప్రైవేటు మద్యం షాపుల్లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మార్పీ ధరల పట్టికను మద్యం షాపుల్లో ప్రదర్శించాలన్నారు. బెల్ట్ షాపులు నిర్వహించరాదన్నారు. అకౌంట్ రిజిస్టర్ అప్డేట్ చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మద్యం షాపుల్లో సేల్స్ మెన్‌లకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి ఎస్ఐ కె.నాగలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

కార్మికులకు పనికి తగిన వేతనం, భద్రత కల్పించాలి

సత్తెనపల్లి: కార్మికులకు పనికి తగిన వేతనం ఇవ్వాలని, పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని పారా లీగల్ వలంటీర్ షేక్ ఖాజావలి అన్నారు. సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వి.విజయ్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మే 1 నుంచి 7 వరకు కార్మిక వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా పట్టణ ఇండస్ట్రియల్ ఎస్టేట్ పార్క్‌లోని శ్రీవల్లి నేషనల్ రూఫింగ్ కంపెనీలో కార్మికులకు న్యాయ అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పారా లీగల్ వలంటీర్ షేక్ ఖాజావలి కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్మిక శాఖ ఉద్యోగి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కార్మిక శాఖ ఇచ్చే లేబర్ కార్డుల వల్ల ప్రయోజనాలు, కార్మికులు తీసుకోవలసిన జాగ్రత్తలు, న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం ఏ విధంగా అందుతుంది తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో శ్రీవల్లి నేషనల్ రూఫింగ్ కంపెనీ అధినేత దేవిశెట్టి శరత్ చంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కానరాని స్వచ్ఛత.. దోమల దండయాత్ర



నీళ్లు ప్రవహించకుండా కాలువలో మట్టి పోసిన దృశ్యం



కాలువలు నిండి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీళ్లు

గ్రామాలలో పారిశుద్ధ్యం అధ్వానం

- సైడ్ డ్రైన్స్ లేక రోడ్లపై పొంగి పొర్లుతున్న మురుగు నీరు
- పట్టించుకోని అధికారులు

అచ్చంపేట: స్వచ్ఛాంధ్రప్రదేశ్, స్వచ్ఛ భారత్ ప్రచారాలకే పరిమితమవుతున్నాయి. గ్రామాలలో వాటి జాడే లేదు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సైడు డ్రైన్స్ శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు పొంగి రోడ్లపై పొర్లుతున్నాయి. పంచాయతీ అధికారులకు మొరపెట్టుకుంటున్నా తమ గోడు వినిపించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు.

■ మండలంలోని వేల్పూరు ఎస్సీ కాలనీలో సుమారు వెయ్యి మందికి పైగా జనాభా ఉంటారు.



సైడు కాలువలు లేక ఇంట్లో నీళ్లు పోయేదారి లేని దృశ్యం

కాలనీలో కొన్ని రోడ్లు మట్టి రోడ్లు. మరికొన్ని రోడ్లు సీసీ రోడ్లు వేసినా సైడ్ డ్రైన్స్ నిర్మించ లేదు. మరికొన్ని రోడ్లకు సైడ్ డ్రైన్స్ ఉన్నా పూడిక తీసే వారే లేరు. మరికొన్ని ప్రదేశాలలో అంతర్గత వివాదాలతో కాలువల్లో నీళ్ల ప్రవహించకుండా కట్టలు వేశారు. దీంతో ఇళ్లలో వాడుకునే నీళ్లు మొత్తం రోడ్ల పైకి వస్తున్నారు.

■ కాలనీలోని శిఖా రాజు ఇంటి వద్ద మురుగు కాలువలో నీళ్ల ప్రవహించకుండా కాలువకు అడ్డంగా మట్టి పోశారు. దీంతో మురుగు నీళ్ల మొత్తం రోడ్లపై ప్రవహిస్తున్నాయి. ఎక్కడ చూసినా మురుగు ప్రవహిస్తుండటంతో దోమల ఉధృతి ఎక్కువైంది. గ్రామస్తులు దోమలతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. కాలనీ వాసులు రోగాల బారిన పడుతున్నారు. గ్రామంలో మూడు నెలలకు ఒక సారి కూడా సైడు కాలువలు శుభ్రం చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దోమల నివారణకు కనీసం ఫాగింగ్ కూడా చేయడం లేదని చెబుతున్నారు. దీనికి తోడు విద్యుత్ కోతలు కూడా ఎక్కువయ్యాయని, పసి పిల్లలు రాత్రిళ్లు నిద్ర కూడా పోవడం లేదని, వారికి తెల్లవార్లూ విసురుతూ కూర్చోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకునే నాథుడే లేడు



మా కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. పట్టించుకునే నాథుడే లేడు. కాలువలలో పూడిక తీయడం లేదు. పంచాయతీ వారికి ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోవడం లేదు. దోమల తీవ్రత ఎక్కువగా ఉంది. కాలనీ వాసులు తరచూ వ్యాధులకు గురవుతున్నారు.

– శిఖా తిమోతి, ఎస్సీ కాలనీ, వేల్పూరు

కాలువలలో మట్టి పోశారు



కాలనీలలో సైడు కాలువల్లో మురుగు నీరు ప్రవహించకుండా మట్టి పోశారు. దాంతో నీళ్లు పోయే దారిలేక రోడ్డుపైకి వస్తున్నాయి. కొన్ని చోట్ల మురుగు నీళ్ల ఇళ్లలోకి కూడా వస్తున్నాయి. దోమల తీవ్రత ఎక్కువగా ఉంది. దీనికి తోడు విద్యుత్ కోతలు కూడా ఎక్కువయ్యాయి. పసి పిల్లలు రాత్రిళ్లు నిద్ర కూడా పోవడం లేదు. పిల్లలకు తెల్లవార్లూ విసురుతూ కూర్చోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

– పెరుమాళ్లు, కాలనీవాసి, వేల్పూరు

పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధులకు తెలపాలి

ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి



మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ

రాజుపాలెం: పార్టీలకు అతీతంగా సర్వసభ్య సమావేశం జరుగు సమయంను ప్రజా ప్రతినిధులందరికీ ముందుగా తెలియజేయాలని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలలో జరిగే అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు. రాజుపాలెం ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు మాట్లాడుతూ గ్రామాలలో జరిగే అభివృద్ధి పనులను, సర్వసభ్య సమావేశం జరుగు తేదీలను కూడా అధికారులు సభ్యులకు తెలియపరచడం లేదని అన్నారు. పెదనెమలిపురి ఎంపీటీసీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒక్క సర్వసభ్య సమావేశానికి కూడా తహసీల్దారు హాజరు కాలేదని, హాజరయ్యే విధంగా చూడాలని తెలిపారు. స్పందించిన ఎంపీడీవో జీవీ సత్యనారాయణ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ అభివృద్ధి జరిగే సమయంలో తప్పకుండా ముందుగా సభ్యులందరికీ తెలిజేస్తామని, తహసీల్దారు హాజరయ్యే విధంగా చూస్తామని చెప్పారు. అనంతరం మండల స్థాయి అధికారులు ఆయా శాఖలలో జరిగే అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో–1 మలిఖార్జున శర్మ, ఏవో వెంకట నర్సయ్య, విద్యుత్ ఏఈ సైదారావు, హౌసింగ్ ఏఈ మురళి మనోహర్‌జోషి, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, పశు వైద్యాధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు బలైన యువకుని కుటుంబానికి ఆర్థిక సాయం



సలీం కుటుంబ సభ్యులతో కమల్‌సైదా

అచ్చంపేట: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు పెట్టి అప్పులపాలై, అప్పులవాళ్ల తాకిడికి బలైన ఓ యువకుడి కుటుంబానికి అన్వేష్ అనే సామాజిక స్పృహ కలిగిన యువకుడు రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని సామాజిక కార్యకర్త షేక్ కమల్‌సైదా ద్వారా మంగళవారం అందజేశారు. మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన యువకుడు షేక్ సలీం(19) అప్పు చేసి క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టి ఓడిపోవడంతో అప్పులు తీర్చే మార్గంలేక మనస్థాపానికి గురై గత నెల 16వ తేదీన ఎలుకల మందు తాగి, చికిత్స పొందుతూ 21న మృతి చెందిన విషయం తెలిసిందే. సామాజిక కార్యకర్త షేక్ కమల్ సైదా ద్వారా విషయం తెలుసుకున్న అన్వేష్ అనే యువకుడు రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కమల్‌సైదా మాట్లాడుతూ సలీం మృతి ప్రతి ఒక్కరికి గుణపాఠం కావాలన్నారు. యువకులు బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని, జీవితాలను బలిచేసుకోకూడదని తెలిపారు.

ప్రకటన బోర్డుల రుసుంపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి

కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం –1965లోని సెక్షన్ 119లో డిస్‌ప్లే డివైజ్‌పై రిజిస్ట్రేషన్ ఫీజు, పర్మిషన్ ఫీజు నూతన విధానం ద్వారా 2025–26 ఆర్థిక సంవత్సరం నుంచి వసూలు చేయుటకు గాను కనిష్ట, గరిష్ట రుసుములతో తయారుచేసిన రేట్ల జాబితాలో పేర్కొనబడిన గరిష్ట రేట్లతో వసూలు చేయుటకు గాను కౌన్సిల్ తీర్మానం నెంబర్ 1274, 2025 ఏప్రిల్ 30 ద్వారా ఆమోదించారని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్ మంగళవారం తెలిపారు. కౌన్సిల్ ఆమోదించిన రేట్లు వసూలు విషయంలో వివిధ ప్రకటన ఏజెన్సీలు, సొంత ప్రకటన బోర్డుల యజమానులు ఏమైనా సూచనలు, అభ్యంతరాలు ఉన్న యెడల గడువు 15 రోజుల్లోగా కార్యాలయ పని వేళల్లో తెలియజేయాలని కోరారు. కౌన్సిల్ ఆమోదించిన రేట్లు 2025–26 ఆర్థిక సంవత్సరం 2025 ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి వస్తాయన్నారు.

అలరించిన పౌరాణిక నాటకాలు



ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి, నటుడు భైరాపట్నం రామకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ఐదవ వార్షిక నాటకోత్సవాలు స్థానిక సత్తెనపల్లి క్రాస్ రోడ్డు వద్ద సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభించారు. ఈ ఉత్సవాలలో తొలి ప్రదర్శనగా భక్త చింతామణి నాటకం ప్రదర్శించారు. దీనిలో ప్రధాన పాత్రధారులుగా జాస్తి సత్యమూర్తి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ, సీహెచ్ ఉదయ శేఖర్, మురుకొండ నాగేశ్వరరావు భక్త చింతామణిగా నాట్య మయూరి జి.రత్న కుమారి తదితర కళాకారులతో ప్రదర్శించబడిన నాటకం ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. అలాగే మలి ప్రదర్శన సత్య హరిశ్చంద్ర నాటకంలో యు.నరసింహారావు, భాస్కర్ రెడ్డి ఆంజనేయులు, గుంజి శ్రీనివాసరావు నటించగా నక్షత్ర పాత్రధారులుగా పోతురాజు కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, బాబురావు, చంద్రమతి, బి.రత్నజ తదితరులు ప్రధాన పాత్రధారులుగా ప్రదర్శించిన నాటకం ప్రేక్షకులను ఆనందింపజేసింది. అనంతరం కళాకారులను భైరాపట్నం రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

వక్ఫ్ సవరణ చట్టంతో ఎన్నో అనర్థాలు



మాట్లాడుతున్న ఆవాజ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంఏ చిష్టి

నకరికల్లు: పేద ముస్లింల కోసం, ధార్మిక కార్యక్రమాల కోసం భూమి, నగదు లాంటివి దానంగా ఇవ్వడాన్ని వక్ఫ్ అంటారని ఆవాజ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంఏ చిష్టి అన్నారు. వక్ఫ్ సవరణ చట్టం 2025 వలన కలిగే అనర్థాలను వివరిస్తూ స్థానిక భగత్‌సింగ్ భవనంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సభకు పీడీఎం అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి అధ్యక్షత వహించారు. చిష్టి మాట్లాడుతూ వక్ఫ్ చట్టం అతిక్రమించి వేరే ఇతర కార్యక్రమాలకు దుర్వినియోగం చేయకుండా వందల ఏళ్ల క్రితం వక్ఫ్ చట్టం రూపొందించబడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ పేరుతో తీసుకొచ్చిన 44 మార్పులు ఆమోదయోగ్యం కాదని అన్నారు. మోదీ విధానాలు ముస్లింలకే కాదు అన్ని వర్గాల ప్రజానీకానికి ప్రమాదం తెచ్చిపెడుతున్నాయన్నారు. అనంతరం ఆవాజ్ కమిటీ మండల కన్వీనర్ షేక్ దరియావలిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.విజయకుమార్, జి.పిచ్చారావు, ఈపూరి లక్ష్మారెడ్డి, ఈపూరి అప్పిరెడ్డి, చట్టు కోటేశ్వరరావు, షేక్ బాజి, షేక్ సుభాని, మడకా వెంకటేశ్వర్లు, షేక్ రబ్బాని, షేక్ సైదా, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు పౌష్టికాహారం అందించాలి

సీడీపీవో శ్రీలత



మాట్లాడుతున్న సీడీపీవో శ్రీలత



మాట్లాడుతున్న మహిళా పోలీస్ సునీత

నకరికల్లు: కిశోర బాలికలకు సరైన పౌష్టికాహారం అందిస్తే వారికి ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలకు శారీరక ఎదుగుదల సమయంలో సక్రమమైన పౌష్టికాహారం అందించాలని అన్నారు. రుతుస్రావం సమయంలో వారిలో మానసిక స్థైర్యాన్ని నింపడంతో పాటు శారీరక మార్పులపై అవగాహన పెంపొందించాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత తెలియజేస్తూ ఆరోగ్య సూచనలు, సలహాలు అందించాలన్నారు. బాల్య వివాహాలు అరికట్టడంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సంతోషకుమారి, సూపర్‌వైజర్ షేక్ రమీజున్, మహిళా పోలీస్ సయ్యద్ రషీదా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిరోధించాలి

అచ్చంపేట: బాల్య వివాహాలను నిరోధించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని మహిళా పోలీస్ ఎం.సునీత అన్నారు. కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. కౌమార బాలికలను రక్షించడం, సాధికారత కల్పించడం, లింగ అసమానతలను పరిష్కరించడం వంటి విషయాలను వివరించారు. కిశోర బాలికలకు వారి హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కిశోర బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, తల్లులు, గ్రామస్తులు, ఆయాలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ జయలక్ష్మి

తొండపి(ముప్పాళ్ళ): వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జీ జయలక్ష్మి చెప్పారు. మండలంలోని తొండపి గ్రామంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వ్యక్తిగత పరిశుభ్రత, రుతుస్రావం అంశాలపై కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రమీల

సత్తెనపల్లి: బాలికలు అన్ని విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.ప్రమీల అన్నారు. పట్టణంలోని 15వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కిశోరి వికాసంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత కాలంలో బాలికలపై మోసాలు అధికమయ్యాయని, ముఖ్యంగా బాల్య వివాహాలు, ప్రేమ పేరుతో మోసం వంటి ఉదంతాలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించేందుకు 11 నుంచి 18 సంవత్సరాల మధ్య బాలికల కోసం కిశోరి వికాసం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా రుతుక్రమం, పరిశుభ్రత, లైంగిక విద్య అనే అంశాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్.స్వర్ణలత, మహిళా పోలీస్ రేచల్ ఏలీన్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

భూసార పరీక్షలను బట్టి రసాయనిక ఎరువులు వాడాలి

జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి



పీసపాడులో మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం



గుండ్లపల్లిలో మట్టి నమూనాలు సేకరిస్తున్న ఏవో దేవదాసు పక్కన రైతులు

రాజుపాలెం: ప్రతి రైతు వేసవిలో లోతుగా దుక్కులు దున్నుకుని వ్యవసాయ శాఖ ద్వారా మట్టి పరీక్షలు చేయించుకుని ఫలితాలను బట్టి రసాయనిక ఎరువులను వాడినట్లయితే పంటకు ముందస్తుగా సూక్ష్మ పోషకాల లోపాలను సవరించుకోవచ్చని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని గణపవరం, కోటనెమలిపురిలో మట్టి నమూనా సేకరణలో జిల్లా వ్యవసాయాధికారి మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాలలో సూక్ష్మపోషక లోపాలను గురించినట్లయితే ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో సూక్ష్మపోషకాలను అందిస్తుందని తెలిపారు. వేసవిలో బోరు వసతి ఉన్న రైతులు మూడవ పంటగా అపరాలు, పెసర సాగుచేసి అదనపు ఆదాయం పొందవచ్చునని చెప్పారు. 50 శాతం సబ్సిడీపై రైతులకు కావాల్సిన విత్తనాలను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో క్రోసూరు ఏడీఏ హనుమంతరావు, ఏవో పి.వెంకట నర్సయ్య, వ్యవసాయ సహాయకులు జయలక్ష్మి, సుశీల, వెంకయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పీసపాడులో భూసార పరీక్షపై అవగాహన

క్రోసూరు: మండలంలో 2025–26 సంవత్సరానికి గాను 15 రైతు సేవా కేంద్రాల ద్వారా 825 మట్టి నమూనాల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఏవో వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. మండలంలోని పీసపాడు గ్రామంలో మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షల ప్రాముఖ్యత గురించి వివరిస్తూ ఒక్కొక్క రైతు సేవా కేంద్ర పరిధిలో 55 చొప్పున మట్టి నమూనాలను సేకరిస్తున్నట్లు ఏవో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల మానవునికి ప్రకృతి సిద్ధంగా లభించిన గొప్ప సంపద అని పంటలు పండటానికి నేల ఒక సహజ వనరు మాత్రమే కాక, పైరు నిలబడటానికి పెరుగుదలకు అవసరమైన తేమను, పోషకాలను అందిస్తుందని తెలిపారు. నేలలో పోషకాల సమతుల్యత పాటించడానికి, రసాయనిక ఎరువుల వినియోగానికి భూసార పరీక్షలు దోహదపడతాయన్నారు. సరైన పద్ధతిలో, తగు జాగ్రత్తలతో తీసిన మట్టి నమూనా నుంచి వచ్చే ఫలితాలు లాభదాయకంగా ఉంటాయన్నారు. మట్టి నమూనాలు సేకరించడంలో మెలకువలను తెలియజేశారు. మట్టి నమూనాలను భూసార పరీక్ష కేంద్రానికి పంపాలని తెలిపారు. కంచేటి రామకృష్ణ సర్వేనెంబర్ 126–1లో ఉన్న మాగాణి పొలం నుంచి మట్టి నమూనా సేకరించారు. కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పంటకు భూసార పరీక్షలు కీలకం

నకరికల్లు: నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు భూసార పరీక్షలు కీలకమని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో పలువురు రైతుల పొలాల్లో మంగళవారం భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 800 మంది రైతులకు చెందిన పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేసి ఫలితాల పత్రాలను రైతులకు అందించామన్నారు. భూసార పరీక్షల వలన భూమిలోని సూక్ష్మపోషకాల వివరాలు గుర్తించవచ్చన్నారు. భూసార పరీక్షల కోసం రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్ తదితర వివరాలతో సమీపంలోని రైతు సేవ కేంద్రాలలో సంప్రదించాలన్నారు. ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ముందుగా భూసార పరీక్షలకు మట్టిని సేకరించే విధానం, ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎం.ప్రసన్నకుమార్, వ్యవసాయ సహాయకులు ఎం.సంధ్యారాణి, రైతులు పాల్గొన్నారు.

దళిత కుటుంబానికి ప్రాణహాని ఉంది రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న మీరయ్య

అమరావతి: మండల పరిధిలోని లింగాపురంలో ఎస్సీ మాదిగ కులానికి చెందిన కంభంపాటి విద్యాధర్ కుటుంబానికి ప్రాణహాని ఉందని వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని ఎంఆర్పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్య అన్నారు. మంగళవారం సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావుకు జిల్లా కలెక్టర్ ఎండార్స్ చేసిన వినతి పత్రాన్ని అందించి అనంతరం ఆయన మాట్లాడుతూ లింగాపురం ఎస్సీ కాలనీలో కంభంపాటి విద్యాధర్ కుటుంబం అంబేద్కర్ జయంతి వేడుకలలో పాల్గొనటమే నేరంగా భావించి ఇంటి పైకి వచ్చి దాడి చేయటం దారుణమన్నారు. ఈ దాడిలో గాయపడిన విద్యాధర్ ఏప్రిల్ 17వ తేదీన ఫిర్యాదు చేస్తే జిల్లా కలెక్టర్ జోక్యంతో ఈ నెల 4న కేసు నమోదు చేశారన్నారు. కేసు నమోదు చేసిన వెంటనే బాధితుడు విద్యాధర్‌కు అతని కుటుంబసభ్యలకు బెదిరింపులు, వేధింపులు మొదలయ్యాయన్నారు. దీనిపై సోమవారం జిల్లా కలెక్టర్‌కు బాధితుడు విద్యాధర్, అతని కుటుంబసభ్యులకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని వినతి పత్రం ఇచ్చామన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి సత్తెనపల్లి డీఎస్పీని తగు చర్యలు తీసుకోమని ఆదేశించారన్నారు. డీఎస్పీ హనుమంతరావు వెంటనే విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అగ్రకులాల వారికి భయపడి దళితుడైన విద్యాధర్ అతని కుటుంబసభ్యులు వేరే గ్రామంలో తలదాచుకుంటున్నారన్నారు. బాధితుడు విద్యాధర్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● ఈ కేవైసీ చేయించుకోవాలి

క్రోసూరు: మండలంలో 2,621 మంది రేషన్ కార్డుదారులకు ఈ కేవైసీ నమోదు కాలేదని, వారు ఆయా డీలర్ల దగ్గర వెంటనే ఈ కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ వీవీ నాగరాజు మంగళవారం తెలిపారు. ఈ కేవైసీ పూర్తి కాకుంటే కొత్త కార్డులు ఇచ్చే క్రమంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని వివరించారు.